# తుషార మాలిక

(1300 త్రిపద కవితల తొలి సంపుటి)



## సిరి వడ్డే

**Thushara Malika**
(1300 Thripada Kavithala Tholi Samputi)

by
**Siri Vadday**

First Edition: November, 2017

© Author

For Copies & Address :
**Siri Vadday**
17, EVANS WAY
SAWSTON, CAMBRIDGE
CB22 3BX
United Kingdom.

Copies: 200

Book Price : Rs. 150/-

Book Publishing Works:
**JV Publications**
jyothivalaboju@gmail.com

Cover Art:
**Krishna Ashok,**
08897385860

DTP & Type Setting:
**K. Ravi Prabha**,
Cell: 96666 08835

*Printed at:*
**Karshak Art Printers,**
Vidyanagar, Hyd.44

*for Copies:*
**Jyothivalaboju**
Phone: 80963 10140

& All Major Book Shops

# తుషార మాలిక

## (1300 త్రిపాద కవితల తొలి సంపుటి)

1. అమ్మ ఒడి...
ఓనమాలు దిద్దించే బడి,
జీవితపాఠం నేర్పించే శారదమ్మ గుడి...!

2. అమ్మ కూడా పసిపిల్లనే ...
నన్ను కొట్టి,
తను ఏడుస్తోందేమిటో... అలా వెక్కి వెక్కి...!

3. నిత్య విద్యార్థిని అమ్మనే...
అలుపెరుగక నేర్చుకుంటుంది,
బోసినవ్వుల భాషను మొదలు...!

4. ఆర్తిగా హత్తుకుపోతోంది...
వా(వీ)డని పున్నాగల సౌరభమేదో,
జ్ఞాపకాల మడతలను... విప్పుకుంటున్న ప్రతిసారీ...!

5. అమ్మ చేతి స్పర్శలా తాకుతోంది...
ఎదను మెత్తగా అద్దుకుంటూ,
నువ్విసిరిన... చల్లని చిరునవ్వొకటి...!

6. అమ్మకింకా చిన్నతనం పోలేదు...
తను కడుపు మాడ్చుకుంటుందేమిటో,
నేనలిగినపుడల్లా...!

25. లోనౌతూనే ఉంటుంది...
పిచ్చి హృదయం,
ఆకర్షణా వికర్షణల తికమకలకెపుడూ...!

26. తనో కాంతిపుంజమే...
నా మనోనేత్రాన్ని,
తాకినపుడల్లా...!

27. ప్రకృతికెన్ని లయలో...
విహంగాల రెక్కల హోరుల్లో,
సాగిపోయే సమీరాల జోరుల్లో...!

28. సనాతనమే...
అతి పురాతనాలైనా,
చంద్రసూర్య తారోదయాలకు...!

29. సుస్వర నాదాలెన్నో...
సవ్వడించే నీటి గుసగుసలతో,
సాగిపోయే సెలయేటి గలగలల్లో...!

30. ఎవరు ఒంపుతారో...
ఆ మబ్బు గిన్నెలను,
తొలకరి పూలజల్లులను కురిపిస్తూ...!

61. అల్లుకుంటున్నా...
క్షణకాలపు అనుభవంతోనే,
జీవితకాలపు అనుభూతులెన్నో...!

62. వెల్లివిరుస్తోంది...
కవన ధనువు,
భావాక్షర వర్ణాలతో...!

63. గతంలోకి పయనమౌతున్నా...
నిన్ను పరిచయించిన క్షణాల్ని,
హత్తుకోవాలనిపించగానే...!

64. తెలిసొచ్చింది...
తన ప్రేమ లోతెంతో,
నిండా మునిగిపోయాకనే...!

65. సెలయేటి కన్నెకెన్ని సిగ్గులో...
చినుకు ముళ్ళు,
నడుము వంపుల్లో గిచ్చుతుంటే...!

66. చుట్టుకునే ఉంటుంది...
నిరాశా వలువల్ని,
తనపై తనకు నమ్మకంలేని ఆశెపుడూ...!

91. ఏకాంతమేగా...
నన్నూరడించే,
సన్నిహిత నేస్తం...!

92. ఏ ప్రేమరాహిత్యమంటిందో...
దూరాల్ని పెంచేస్తూ,
భారాల్ని దరికి చేరుస్తూ...!

93. తెలుసుకున్నా...
తేటగీతి పుట్టుకను,
పాపల తేనెలూరు పలుకుల్లోంచే జనించిందని...!

94. దగ్ధమైపోయే ప్రేమలెన్నో...
ద్వేషాగ్ని జ్వాలలకు,
ఆహుతైపోతూ...!

95. పరుగులెడుతున్నా...
ఒంటరి మరీచికల వెంట,
దేనికో తెలియని అన్వేషణలో...!

96. గుప్పుమంటోంది...
నీ చెలిమి సౌరభం,
నేనల్లుకుంటున్న విరిమాలల్లో...!

127. చివురిస్తోంది...
ఆశల వసంతం,
మదికోయిల స్వరాగాలతో...!

128. విస్మరించకలా...
నేటి యువతరమే,
రేపటి వృద్ధతరమన్న నిజాన్ని...!

129. అపూర్వ నేస్తాలే...
కష్టసుఖాలెప్పుడూ,
వెనువెంటనే వచ్చిపోయే బంధువుల్లా...!

130. విశ్రాంతినెరుగనిదే...
విధాత ఘంటం,
జన్మజన్మల కర్మల ఫలసంకలనాలతో...!

131. కోకిల స్వరమే కాదు...
తన మనస్సూ మధువే,
చేదును తింటూ... ఆమనికి తీయందనాలనద్దుతూ...!

132. మరణశయ్యపైనే శయనిస్తుంది...
బిడ్డను ఇలకు తెచ్చే తన్మయత్వంలో,
అతివ అమ్మైనప్పుడల్లా...!

145. నాకే కాదు...
అక్షరాలకూ మత్తు పూసినట్లే,
ప్రతి పదం తన కవనమై ఒదిగిపోతుంటేనూ...!

146. తేల్చుకోలేకున్నా...
గోరింటలు పండిన తన చేతులో,
సిగ్గులు పండిన తన చెక్కిల్లో... మెరుపులీనేది...!

147. ఏ చెలిమి చినుకు తాకిందో...
హృదయం మురిసింది,
మైమరుపుల ఇంద్రధనువు విరియగానే...!

148. వసంతాలై పోతున్నాయి...
గ్రీష్మ శిశిరాలన్నీ,
నీ తలపుల తొలకరి జల్లులతో...!

149. పొంగిపోతోంది...
ఎద సంద్రమై,
చినుకువై నువ్వు తాకగానే...!

150. కన్నీటి బొట్టై రాలితే చాలుగా...
ఒక నిండైన హృదయం నుండి,
శ్రద్ధాంజలిగానైనా...!

169. మౌనమెపుడూ చులకనే...
మాటల రాళ్ళను విసిరేసే,
మేకవన్నె పులులంటి మోసగాళ్ళకు...!

170. ఎడబాటు రాగాన్నే మీటుతుంటావు...
నేనెంతగా అనురాగమై అల్లుకుంటున్నా,
హృదయతంత్రులను నిర్దాక్షిణ్యంగా తెంచేస్తూ...!

171. ఇంత పులకింతలు దేనికో...
గున్నమావి చివుళ్ళకు,
గండుకోయిలలెంతగా తూట్లు పొడుస్తున్నా...!

172. తోడొస్తోంది ఓ వింత పరిమళం...
జన్మజన్మలనంటుతూ,
నీ ప్రేమబంధపు మరువం కాబోలు...!

173. ఎంత చల్లని మనసో...
మంచుపూలది,
గరికలను సైతం ఆర్తిగా హత్తుకుంటూ...!

174. హరివిల్లు బడాయి పోతోంది...
ఒయారాలు ఒలకబోతలో,
తాను ఇమిడిపోగానే...!

193. ఒక్క నమ్మకపు విత్తైనా మొలకెత్తదెందుకనో...
రైతన్నలు చెమట నీళ్ళనే చల్లుతున్నా,
ఉప్పునీటి ఏరులనెంతగా పారిస్తున్నా ...!

194. ఉరితాడును నేస్తూనే ఉంటుంది...
మనస్సు లేని కొయ్యమగ్గం,
చినిగిన పంచెలతోనో... కాలే కడుపులతోనో...!

195. ముక్కలై వ్యర్థమైపోతోంది...
రైతన్నల కష్టమంతా,
పగిలిపోతున్న దిష్టి గుమ్మడికాయలతో...!

196. తప్పు చేసాడట మనిషిగా...
మహనీయుడయ్యాడులే,
ఆ తప్పును సరిదిద్దుకుని...!

197. దొరికినట్లుంది...
తెగింపు దారి ఒకటి,
అవకాశపు మార్గాలన్నీ మూసుకుపోగానే...!

198. తెంచుకోవడమే మేలు...
అంతులేని అగాధాలను మిగిల్చే,
అనవసరమైన బంధాలన్నింటినీ...!

223. స్థిరమైనదే...
మానవత్వమెపుడూ,
స్థిరమెరుగనిదల్లా... మనుషులు మాత్రమే...!

224. ధనదాహం...
పెరుగుతూనే ఉంటుంది ధనంతోబాటుగా,
వృద్ధోపాంత ప్రయోజన సూత్రానికి గొప్ప ఉదాహరణలా...!

225. పక్షులకెంత నమ్మకమో...
మన అహింసావాదిపై,
చేతికఱ్ఱతో నిలుచున్నా బెదిరిపోకుండా...!

226. కామిగానివాడు మోక్షగామికాడుట...
పెళ్ళి నాటకం ముగించినట్లే,
భార్యకు మోక్షాన్ని ప్రసాదిస్తూ...!

227. ఒలికినట్లైంది...
మనిషి రంగేదో,
మలినమైన రంగులను ఒంపేస్తుంటే...!

228. పసిదనం...
మోయలేకుందిప్పుడు,
పుస్తకాలతోబాటు అక్షరాల్ని కూడా...!

253. సూత్రానిది అమాయకత్వమే...
తానే బందీగా మిగిలిపోతుంది,
సుమాలను బంధించే ప్రయత్నంలో...!

254. గులాబీలదే పరిమళమంటే ఎలా...
గరికతోటలోనూ విహరించరాదూ,
హృదయముందని నిరూపించుకునేందుకైనా...!

255. మొత్తం చూపించేస్తుందిగా...
ఉన్నదున్నట్లుగానే,
ఒళ్ళంతా కళ్ళు చేసుకుంటూ... మాయలమారి దర్పణం...!

256. చులకన భావమేలే పచ్చనోట్లకెపుడూ...
తేలికైన తమకోసం,
బరువైన బంధాల్ని తెంచేసుకుంటున్నామని...!

257. తప్పు కాదేమోలే...
ఒకే మనసుండడం,
తప్పంతా... ఒకేసారి మనసివ్వడమే (మనసిచ్చేయడమే)...!

258. నమోదు చేసుకోక తప్పదేమో...
మంచితనాన్ని,
కాలగ్రంథంలో మనకో పేజీ మిగలాలంటే...!

283. పరుగులు తీస్తూనే ఉంటాడు... చిలిపి సూరీడు...
పడమర కాంత కౌగిలిలో బందీగా ఒదిగేందుకు,
తూరుపు కన్నె వెచ్చదనపు కానుకలందిస్తున్నా...!

284. స్మృతుల అక్షయం నుండి తొణికిపోయే...
కాలపు బిందువులెన్నో,
గతాలను వర్తమానంలోకి ఒంపుకుంటూ...!

285. జాలి తెలియనిదే మరణం...
ఒంటరై తానొస్తూ,
ఒంటరులను చేసిపోతూ...!

286. కూల్చుకుంటూనే ఉంటుంది కాలం...
గతపు శిథిలాలను,
వర్తమానపు పునాదులను నిర్మించుకుంటూ ...!

287. నర్తిస్తున్నాయి యవ్వన కన్యకలు...
చిరు సవ్వడితో,
మది మౌనపు ప్రాంగణంలో స్మృతులనలంకరించుకుంటూ...!

288. ఎన్ని వలపు చిలకలను అందుకుంటాడో...
తూరుపు, పడమర కాంతల మందిరాలనుండి వస్తూ,
సిగ్గుల గోరింటలు పండిన ఎర్రని మోముతో... ఆదిత్యుడు...!

325. అద్భుతం కదూ...
గింజ గుండెను చీల్చుకుంటూ వచ్చే,
బుల్లి అంకురం పసి(డి) సోయగం...!

326. అల్లుకుంటూనే ఉన్నా...
ఊహల పూసలను... ఆశల దారాలతో,
మది గవాక్షానికి తోరణాలుగా కట్టుకుంటూ...!

327. ఎదురు తెన్నులే కాస్తున్నా...
ఆశల నేత్రాలతో,
నీ తలపులే తడిమి తడిమి ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే...!

328. ఏ హేమంతపు చేమంతులను తురిమిందో...
వాలుజడతో వయారాలు పోతోంది,
ఆమని సింగారంతో... ప్రతి తరువు విరిగంధమద్దుకుంటూ...!

329. వలపు రాయిని విసిరేయకలా...
మనసు తేనెతుట్టపై,
జ్ఞాపకాల తేనెటీగలు చుట్టి ముట్టి కుట్టి చంపుతాయి...!

330. చేదు జ్ఞాపకాలను రాలుస్తూ...
మనసు ముంగిట కురిసిపోతోంది,
ఓ దట్టమైన కన్నీటి మేఘం...!

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Tushara+Malika**

* * *